క్లుప్తంగా

కేజీబీవీలో తనిఖీలు

తుని రూరల్: మండలం వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శనివారం సమగ్ర శిక్షా ఐఈఆర్టీ మానిటరింగ్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావు తనిఖీలు నిర్వహించారు. మొదట సెమిస్టర్ పాఠ్యాంశాల ప్రగతిపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. కాపీ రైటింగ్‌పై విద్యార్థినులకు, ప్రశస్త్ యాప్‌పై ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థినులకు సెమిస్టర్ -2 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. మండల విద్యాశాఖ అధికారి పరవాడ గీతాదేవి పాల్గొన్నారు.

నేడు రోప్ స్కిప్పింగ్ టీముల ఎంపిక

తుని: కాకినాడ జిల్లా పరిధిలోని రోప్ స్కిప్పింగ్ జట్ల ఎంపిక ఆదివారం జరుగుతుందని జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.విక్టర్‌బాబు శనివారం తెలిపారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు రోప్ స్కిప్పింగ్ అండర్-11, అండర్-19 కేటగిరిలో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99482 83945, 99596 85789 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

భవిత కేంద్రానికి స్పీచ్ ట్రైనర్ మెషీన్ వితరణ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం భవిత సెంటర్‌కు సామర్లకోట మండలం కొప్పవరం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుత్తాల ప్రసన్నకుమార్ స్పీచ్ ట్రైనర్ మెషీన్‌ను బహూకరించారు. భవిత సెంటర్‌లో వినికిడి లోపంతో బాధపడుతున్న పిల్లలకు స్పీచ్ థెరపీ నిమిత్తం రూ.17 వేలు విలువ చేసే స్పీచ్ ట్రైనర్ మెషీన్‌ను అందజేశారు. దాత ప్రసన్న కుమార్‌ను ఎంఈఓ వి.రాజబాబు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 అచ్చిరాజు, సీఆర్పీలు గంగారావు, మల్లేష్, ఐఈఆర్టీలు కుమార్ రాజా, కృష్ణ పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెంలో గత టీడీపీ ప్రభుత్వ హయంలో చేసిన పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా అధికారులు విచారణ చేశారు. అప్పట్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. డీఈ మోహన్‌రెడ్డి, పీఆర్‌డీఈ ఉమా శంఖర్, డీఎల్‌పీఓ బాలామణి, ఎంపీడీఓ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గోకవరం: గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై యువి శివనాగబాబు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన జి.వీరవెంకటరమణ సంత మార్కెట్ సమీపంలో మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతని నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం తరలించినట్టు తెలిపారు.

ఆట స్థలాన్ని బాగు చేస్తాం

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆట స్థలాన్ని చదును చేయించడంతో పాటు తూర్పు గేటు తెరవడం, ప్రహరీ చుట్టూ కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాలు త్వరలోనే పూర్తి చేస్తామని మండల సచివాలయాల కన్వీనర్, గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా అన్నారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో అవలంబిస్తున్న డిజిటల్ విద్యావిధానం గురించి హెచ్‌ఎం రంగా ఆయనకు వివరించారు.

కేంద్ర పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ సూచించారు. ప్రత్తిపాడు సరయు ఫంక్షన్ హాలులో శనివారం భారతీయ జనతా పార్టీ జిల్లా స్థాయి పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ నెల 26న పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నవరంలో బస చేస్తారని తెలిపారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి కోడూరి లక్ష్మీనారాయణ, పార్టీ రాష్ట్ర స్థాయి నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, ముత్తా నవీన్ కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా లలితా, విష్ణుసహస్ర నామ పారాయణలు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం లలితా, విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. గోపాలపట్నం, అన్నవరం గ్రామాలకు చెందిన మహిళా భజన సమాజం సభ్యులు రెండు రోజులుగా ఆలయంలో లలితా సహస్ర నామాలు, విష్ణు సహస్ర నామాలు పఠించారు. భక్తిపాటలు ఆలపించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో ఉత్సాహంగా 'జగనన్న సురక్ష'



సోమరాయణంపేటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ఉత్తరకంచిలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

కిర్లంపూడి: గ్రామాల్లోని అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని సోమరాయణంపేటలో శనివారం సర్పంచ్ సరిసే లక్ష్మి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మరణించిన పెంటకోట ఆదిబాబు కుటుంబానికి ఎమ్మెల్యే చంటిబాబు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, తోట విష్ణు, పెంటకోట నాగబాబు, సరిసే సంతోష్, సరిసే కృష్ణ, బొడ్డేటి లక్ష్మి, బొడ్డేటి సంతోష్, జోకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రజల కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉత్తరకంచిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రజలు జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, గ్రామ సర్పంచ్ మంతిన శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యుడు గంటా మహాలక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని మురారి గ్రామ సచివాలయం- 2 వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు ఎంపీపీ చలగళ్ల దొరబాబు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల ఆనంద్‌బాబు, ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఎంపీటీసీ రుంజల రాణి పాల్గొన్నారు.

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల కష్టాలు తీరాయని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత అన్నారు. మండలంలోని పైడికొండ పంచాయతీ ఆనూరు గ్రామ సచివాలయం-2 వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, సర్పంచ్ నరిశే నాగ దుర్గ పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఈఓపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనంద హరి, పార్టీ నాయకులు నరిశే తాతయ్యలు పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని పి.మల్లాపురంలో సర్పంచ్ గుండు నాగదేవి అధ్యక్షతన శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాస్, ఇతర అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుండు చెంచుబాబు, పసగడుగుల నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జగ్గంపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ఇర్రిపాకలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, గ్రామ సర్పంచ్ తిర్ర దేవి, కంచి లక్ష్మణదొర, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ వసంతకుమార్ పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని రాఘవపట్నంలో శనివారం ఎంపీడీఓ ఎం.గోవింద్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు అయితా నాగరత్నం, డీటీ పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో శనివారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు సీంద్రపు భాస్కరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, డైరెక్టర్ గోళ్ల జయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పొలంబడితో అధిక దిగుబడి



కిర్లంపూడిలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

కిర్లంపూడి: వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. కిర్లంపూడిలోని కర్రి చిన్నారావు పొలంలో శనివారం ఏఓ జోకా అమృతా అధ్యక్షతన డాక్టర్ వైఎస్సార్ పొలంబడిపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఓ విజయకుమార్ మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమాల్లో రైతులకు సేంద్రీయ ఎరువులను వినియోగం, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.దైవకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పొలంబడితో నాణ్యమైన దిగుబడులు

శంఖవరం: పొలంబడి సూత్రాలతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం వ్యవసాయ సిబ్బందికి పొలంబడి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. రైతులకు పొలంబడి సూత్రాలు, ఆవశ్యకతను వివరించారు. నారుమడి తయారీ, తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమన్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వరి నారుమడిని పరిశీలించారు. రైతులు ఎప్పటికప్పుడు పొలాలను పరిశీలించాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగు మందులు వినియెగించాలని సూచించారు.

ఎస్సీ రైతులకు రూ.1.36 కోట్ల విత్తనాల పంపిణీ



తొండంగిలో దళిత రైతుకు విత్తనాలు పంపిణీ చేస్తున్న పెదపాటి అమ్మాజీ తదితరులు

తొండంగి: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల ఆర్థిక సహకార సంఘం లిమిటెడ్ ద్వారా కాకినాడ జిల్లాలో 1439 మంది ఎస్సీ రైతులకు రూ.1.36 కోట్ల విలువ చేసే యంత్ర పరికరాలు, విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు ఆ సంఘ కార్యనిర్వాహక సంచాలకులు చినరాములు తెలిపారు. తొండంగి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎస్సీ రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి అనుసుచిత్ జిత్ అభ్యుదయ యోజన (పీఎంఏజేఏఓ) కింద ప్రకృతి వ్యవసాయం చేసే ఒక్కొక్క రైతుకు రూ.9,500 విలువ చేసే జొన్న, మొక్కజొన్న, రాగులు, సజ్జలు, కొర్రలు, పెసలు, కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ మాట్లాడుతూ దళితుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో దళితులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అనంతరం లబ్ధిదారులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సునీత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పశుపులేటి సతీష్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ అంజేయులు తదితరులు పాల్గొన్నారు.

భజన కళాకారుడికి సన్మానం

ఏలేశ్వరం: పట్టణానికి చెందిన భజన కళాకారుడు మజ్జి సత్యనారాయణను శనివారం ఘనంగా సన్మానించారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు నడిశెట్టి తిరుపతిరావు ఆధ్వర్యంలో కళాకారుడు సత్యనారాయణను శాలువా, పూల మాలతో సత్కరించారు. అనంతరం స్థానిక రూపులమ్మ అమ్మవారి ఆలయంలో పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల సభ్యులు విష్ణు సహస్ర, లలితాసహస్ర నామ పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. వీహెచ్‌పీ సభ్యుడు ఉడతల రమణారావు, సంఘ మహిళాసభ్యులు పాటోలు దేవి, మల్లేశ్వరీ, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

తుని: స్థానిక రాజా గ్రౌండ్‌లో తొండంగి దివంగత ఎంపీపీ అంగులూరి అరుణ్‌కుమార్ జ్ఞాపకార్థం మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో వాలీబాల్ టోర్నీ ఏర్పాటు చేశారు. తుని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ పోతుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గారా శ్రీను శనివారం ఈ టోర్నీని ప్రారంభించారు. నియోజకవర్గంలో యువతను క్రీడల పరంగా ప్రోత్సహించేందుకే మంత్రి రాజా ఇటువంటి టోర్నీలు నిర్వహిస్తున్నారని నాయకులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- లింగంపర్తిలో గడపగడపకూ మన ప్రభుత్వం



లింగంపర్తిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని లింగంపర్తిలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పాలనే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో అర్హులకు పథకాలు దక్కాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, పార్టీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, యార్లగడ్డ రాజాచౌదరి, వడ్డి శ్రీవాస్తవ, గొంతిరెడ్డి సతీష్, పసల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

106 మందికి వైద్య పరీక్షలు



చిల్లంగిలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హేమాంజలి

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి రామాలయం వద్ద శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి హేమాంజలి 106 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 64 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కాశీ అన్నపూర్ణ, ఏఎన్‌ఎం పి.సునీలకుమారి, బి.నాగార్జున, దుర్గారావు, శివశంకర్, స్వప్న, ఎస్.మణి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ఆందోళన



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న ఐలాజ్ ప్రతినిధులు

ప్రత్తిపాడు: మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హక్ కమిటి కన్వీనర్ బుగత శివ ఆరోపించారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ప్రత్తిపాడులో శనివారం సాయంత్రం ఐలాజ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణం నుంచి నల్ల బ్యాడ్జీలను ధరించి, అంబేడ్కర్ కళా మందిర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద న్యాయవాదులు కళ్లకు గంతలు కట్టుకుని ధర్నా చేపట్టారు. మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐలాజ్ ప్రతినిధులు అవసరాల దేవి, కందా వెంకట రాజు, నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు మానుకొండ లచ్చబాబు, కె జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు



భద్రవరం జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని భద్రవరం జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంతిళ్లు ఉండాలనే ఉద్దేశంతో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. వందలాది మందికి ఒకేచోట ఇళ్లు నిర్మించడంతో కొత్తగా ఊళ్లు ఏర్పాటు అవుతున్నాయన్నారు. జగనన్న కాలనీల్లో రహదారులు, విద్యుత్, సాగునీటి వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, ఉగ్గిన రాజు, కూనపురెడ్డి దుర్గారావు, చీమల వెంకన్నబాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల సందర్శన

కోనందూరు: హౌసింగ్ డే సందర్భంగా శనివారం అధికారులు జగనన్న కాలనీలను పరిశీలించారు. కేఈ చిన్నయ్యపాలెంలో జగనన్న కాలనీని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ పరిశీలించారు. ఇళ్లనిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ ఏఈ శేఖర్ పాల్గొన్నారు.

వ్యవసాయ, ఉద్యాన సిబ్బందికి శిక్షణ



వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అసిస్టెంట్ల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా పట్టపరిశ్రమ అధికారి

తుని రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను సన్న, చిన్నకారు రైతుల దరిచేర్చాలని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి బి.రామరాజు అన్నారు. తుని మండలం వి.కొత్తూరులో శనివారం వీఏఏఎస్, వీహెచ్‌ఏఎస్, వీఎస్‌ఏలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మల్బరీ, పట్టు పురుగుల పెంపకందారులకు రాష్ట్రం ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రేరింగ్ షెడ్లు, దుక్కులు, మల్బరీ తోటల పెంపకానికి రాయితీలు ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ రాయితీలను రైతులకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామ సభలు ద్వారా ఎంపిక చేసిన 30 మంది రైతులను పొలంబడిలో భాగస్వాములు చేయాలని ఏఓ బి.అశోక్ కుమార్ సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి పి.జగ్గప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ



రత్నగిరిపై స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు తిరిగి పూజలు చేసి ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టెం శివ, రమేష్ ఘనపాఠి, యడవిల్లి వేంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో స్వచ్ఛసర్వేక్షణ్ సర్వే



ఎ.కొత్తపల్లిలో మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ సెంట్రల్ టీమ్ సభ్యులు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ సెంట్రల్ టీమ్ పర్యటించింది. బృంద సభ్యులు ఇంటింటికీ వెళ్లి అనుసరిస్తున్న పారిశుధ్య విధానాలు, ఆరోగ్యపరంగా తీసుకుంటున్న జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. ఇళ్లల్లో మరుగుదొడ్లను పరిశీలించారు. గ్రామంలోని డ్రైన్లు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలను పరిశీలించి వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అప్పారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

ఏలేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని పేరవరం ఎంపీపీ స్పెషల్ స్కూల్, ఎంపీపీ మెయిన్ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ, వెన్నా శ్రీను, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓటర్ల సర్వే పారదర్శకంగా చేయాలి

తుని: పట్టణంలో ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేయాలని బీఎల్‌ఓలకు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల వివరాలను డోర్ టు డోర్‌కు వెళ్లి పరిశీలించాలన్నారు. ముఖ్యంగా మరణించిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను సేకరించాలన్నారు. వచ్చే నెల 21 వరకూ వార్డుల్లో సమగ్ర సర్వే చేయాలని ఆదేశించారు.

ఓటరు సర్వే పరిశీలన

రౌతులపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న ఓటరు నమోదు సర్వేను శనివారం జిల్లా పరిషత్ కార్యాలయ అధికారి బి.రమావతి పరిశీలించారు. రౌతులపూడి రామకృష్ణాకాలనీ, బీసీ కాలనీ ఆమె పర్యటించి ఓటరు నమోదుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదుపై ఏమైనా అభ్యంతరాలుంటే సిబ్బందికి తెలియపరచి సరిచేసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పులు జరగకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహించాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఫ్యాక్టరీల్లో ఉద్యోగాలకు స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని యునైటెడ్ మానవ హక్కుల ప్రొటెక్ట్ కౌన్సిల్ జాతీయ లీగల్ కార్యదర్శి పిల్లి బలరాముడు కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్టరీల్లో స్థానికులకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రైవేట్ ఫ్యాక్టరీలకు భూములు ఇచ్చిన వారి పిల్లలకు ఉపాధి కల్పించాలన్నారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యాలు పునరాలోచించాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దర్యాప్తు వేగవంతం

- సీసీ ఫుటేజ్ ఉన్నా దొరకని హంతకుల ఆనవాళ్లు
- జల్లెడపడుతున్న పోలీసులు



హంతకుల ఊహా చిత్రాలు

తుని రూరల్: ఈ నెల 16న జరిగిన మహిళ హత్య, ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన హంతకుల కోసం పోలీసులు జల్లెడపట్టి గాలిస్తున్నా ఆనవాళ్లు దొరకడం లేదు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, పది మంది ఎస్సైలతో పాటు కానిస్టేబుళ్లతో కూడిన ఎనిమిది ప్రత్యేక బృందాలు హంతకుల కోసం గాలిస్తున్నాయి. మహిళ హత్య, ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నానికి ముందు తేటగుంట సెంటర్లో హంతకులు హోటల్‌కు వెళ్లినట్టు పోలీసులు సీసీ ఫుటేజ్‌లో గుర్తించారు. ఆ ఫుటేజ్‌లో హంతకుల ముఖాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ఆనవాళ్లు లభించడంలో ఆలస్యమవుతోంది. జాతీయ రహదారిపై ఉన్న సీసీ ఫుటేజ్‌తో పాటు వివిధ హోటళ్లు, దుకాణాల్లో సీసీ ఫుటేజ్‌లు సేకరించి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సమీపంలో ఉన్న వివిధ కంపెనీల్లోనూ హంతకుల కోసం వాకాబు చేస్తున్నారు. అనుమానితులు ఊహా చిత్రాలతో ఒడిశాతో పాటు తెలంగాణలోనూ పోలీసులు గాలిస్తున్నారు. హంతకుల ముఖాలు స్పష్టంగా కనిపించే సీసీ ఫుటేజ్‌లు లభిస్తేనే దర్యాప్తు వేగవంతమవుతుందని పోలీసులు తెలిపారు.